క్లుప్తంగా

గిరి ప్రదక్షిణకు బస్ సౌకర్యం

ఉదయగిరి: అరుణాచలంలో ఏప్రిల్ 6న పౌర్ణమి సందర్భంగా జరిగే గిరి ప్రదక్షిణకు ఉదయగిరి ప్రాంత భక్తుల సౌకర్యార్థం వచ్చే నెల 5వ తేదీ ఉదయం 8 గంటలకు ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్ సర్వీస్ నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మారెళ్ల శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం సర్వీసుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. ఒక్కో మనిషికి రాను, పోను రూ.1,650 చార్జీగా నిర్ణయించామన్నారు.

23 లోపు ఎంట్రీలకు ఆహ్వానం

వరికుంటపాడు: ప్రకాశం, నెల్లూరు జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్, టెన్నిస్‌బాల్ టోర్నమెంట్ పోటీలు ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు జరిగే పోటీలకు తమ ఎంట్రీ ఫీజును ఈ నెల 23వ తేదీలోపు చెల్లించి నమోదు చేసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో టోర్నమెంట్ల నిర్వాహకులు తెలిపారు. ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం మండలం శీలంవారిపల్లెలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.50,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌కు రూ.3,116 వంతున అందజేస్తారన్నారు.

వైఎస్సార్ ఆసరా సంబరాలు


పొదుపు గ్రూపు సభ్యులతో మాట్లాడుతున్న వీఓఏ రహమత్ బాషా

మర్రిపాడు: మండలంలో వైఎస్సార్ ఆసరా 3వ విడత సంబరాలను ఆదివారం నిర్వహించారు. నందవరంలో వైఎస్సార్ 3వ విడత రుణమాఫీకి అర్హత ఉన్న 32 గ్రూపు సభ్యులతో వీఓఏ రహమత్ బాషా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసరా 3వ విడతకు సంబంధించిన రుణమాఫీ వివరాలను వివరించారు. గడప గడపకు వెళ్లి గ్రూపు సభ్యులతో రుణమాఫీ ఎంత పడుతుందో వివరించారు. అర్హత కలిగిన ప్రతి గ్రూపుకు వైఎస్సార్ ఆసరా 3వ విడత రుణమాఫీ ప్రభుత్వం చేసిందన్నారు.

పంద్రంగిలో ఉచిత వైద్యశిబిరం


మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి

సీతారామపురం: సీతారామపురం పంచాయతీలోని పంద్రంగిలో ఆదివారం అటవీశాఖ ఆధ్వర్యంలో నెల్లూరు రెయిన్‌బో హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఉదయగిరి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిచడమే కాకుండా అవసరమైన వారికి నెల్లూరులో ఆపరేషన్‌లు చేయిస్తామన్నారు. అటవీ సంపద ఏ విధంగా కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. అటవీ సంరక్షణపై గ్రామ ప్రజలకు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో హాస్పిటల్ వైద్యులు ఎఫ్‌డీఓ ఖాజారసూల్, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

వృద్ధులను ప్రేమతో చూడాలి

• డాక్టర్ ఎం.రామస్వామి


పేద వృద్ధులకు నిత్యావసర వస్తువులు, నగదు పంపిణీ చేస్తున్న అతిథులు

కావలి రూరల్: సమాజంలో నిరాధారణకు గురైన వృద్ధులను ప్రేమగా చూసుకోవాలని డాక్టర్ ఎం.రామస్వామి తెలిపారు. పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పేద వృద్ధులకు నిత్యావసర వస్తువులు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి ఆశయ సాధనలో భాగంగా ఆయన కుమారులు పేదలకు అండగా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. పేద వృద్ధులను ఆదుకోవడం ఒకటన్నారు. ఈ సేవా సమితి ద్వారా పేద వృద్ధులకు తమ కందుకూరి వైద్యశాలలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్ కుమార్, సేవా సమితి చైర్మన్ దొడ్ల లక్ష్మి, డాక్టర్ రమ్య, సేవా సమితి సభ్యులు తాతిరెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ మనోహన్‌రెడ్డి, టి.రామకృష్ణ, అమరావతి, వృద్ధులు పాల్గొన్నారు.

సోమశిలలో 56.050 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 56.050 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 1,500 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 493, దక్షిణకాలువకు 300, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.437 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 308 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.


బిట్రగుంట: కడనూతలలో వరిపంటను కాపాడుకుంటున్న రైతు


సంగం: రోడ్డుపై ధాన్యాన్ని ఆరబోసుకుంటున్న రైతులు


కలిగిరి: కుమ్మరకొండూరులో ఇంటిపై పడిన చెట్టు


కలిగిరి: నెలకొరిగిన నిమ్మచెట్లు


జలదంకి: చినక్రాక నిమ్మతోటలో వేళ్లతో సహా కూలిపోయిన నిమ్మచెట్టు


ఆత్మకూరులో నీట మునిగి నేలవాలిన వరి పైరు


చేజర్ల: నేలవాలిన వరి పైరు

‘ముంచిన అకాల వర్షం’

బిట్రగుంట: బోగోలు మండలంలో రెండు రోజుల పాటు కురిసిన అకాల వర్షాలు అన్నదాతలను నిలువునా ముంచాయి. 48 గంటల వ్యవధిలో 79.8 మి.మీ. వర్షపాతం నమోదు కావడంతో కోతకు సిద్ధమైన వరికి వెన్ను విరిగింది. కడనూతల, ముంగమూరు, ఎస్వీపాళెం, అల్లిమడుగు తదితర గ్రామాల్లో 452 ఎకరాల్లో వరిపంట నేల వాలగా 149 మంది రైతులకు పంట నష్టం వాటిల్లింది. పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపి నేలవాలిన పంటను కాపాడుకునేందుకు ముంపు రైతులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి.

ఆత్మకూరు డివిజన్‌లో 227.4 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: ఆదివారం ఉదయం వరకు గడిచిన 24 గంటల్లో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 227.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది తెలిపారు. అత్యధికంగా సంగం మండలంలో 60.4 మి.మీ., ఆత్మకూరు 48.4 మి.మీ., చేజర్ల 38 మి.మీ., మర్రిపాడు 27.2 మి.మీ., ఉదయగిరి 10.4 మి.మీ., కలువాయి 14.2 మి.మీ., ఏఎస్‌పేట 14.2 మి.మీ., సీతారామపురం 9.2 మి.మీ., అనంతసాగరం 5.4 మి.మీ., చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

నేలవాలిన వరి పైరు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు చెరువు కింద సాగులో ఉన్న వరి పైరు శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నీటమునిగి నేలవాలింది. బట్టేపాడు రోడ్డుకు సమీపంలో సుమారు 40 ఎకరాల వరి పైరులో నీళ్లు నిలిచిపోయాయి. మండల ఏఓ కిషోర్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, జరిగిన పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

అన్నదాతలు కన్నీటి పర్యంతం

సంగం: శుక్ర, శనివారాల్లో వచ్చిన అకాల వర్షం అన్నదాతల కొంప ముంచింది. మండలంలో మార్చి రెండో వారం ప్రారంభంతో వరికోతలు ముమ్మరం చేసి ధాన్యాన్ని కోసి కళ్లాల్లో ఆరబెట్టారు. ఒక్కసారిగా వచ్చిన వర్షంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఆదివారం నిల్వ చేసిన ధాన్యానంతా రోడ్లపైకి తెచ్చుకుని ఆరబోసి రైతులు, రైతు కూలిలు ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. సంగం నుంచి బుచ్చిరెడ్డిపాళెం వరకు నెల్లూరు– ముంబయి జాతీయ రహదారి పక్కన, పొలం గట్ల వద్ద ఆరబోసిన ధాన్యం రాసులు దర్శనమిచ్చాయి. ఇప్పటి వరకు 85 హెక్టార్లలో పంట నష్టం సంభవించినట్లు వ్యవసాయాధికారి ఎస్ శ్రీహరి తెలిపారు.

వరి, పత్తి, మామిడి, నిమ్మకు నష్టం

జలదంకి: జలదంకి మండలంలో శనివారం రాత్రి భారీ ఈదురుగాలులతో పాటు కురిసిన వర్షానికి వరి, పత్తి, మామిడి పంటలు తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నాయి. మండలంలో ఒక పక్క గ్రామాల్లోనే గాలులతో పాటు వర్షం కురిసింది. గోపన్నపాళెం, అన్నవరం, దాసరి అగ్రహారం, గట్టుపల్లి, తిమ్మసముద్రం, రామవరప్పాడు, కేశవరం తదితర గ్రామాల్లో విపరీతమైన గాలులతో పాటు వర్షం కురిసింది. దీంతో విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్లు నెలకొరిగాయి. వరి పంట కోత దశలో ఉండడంతో గాలులకు వడ్ల గింజలు మొత్తం రాలిపోయి నీటిలో మునిగాయి. దీంతో పంట 80 శాతం మేర దెబ్బతిందని రైతులు వాపోతున్నారు. పత్తి పంటలో చెట్టు కాండాలు తెగిపోయి ఆకులు రాలిపోయాయి. మామిడి చెట్లు కొన్ని పూర్తిగా పడిపోయాయి. చినక్రాకలో నిమ్మ తోటల్లో కూడా చెట్లు వేళ్లతో సహా కూలిపోయాయి. ట్రాన్స్‌కో ఏఈ చంద్ర విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సిబ్బందితో కలిసి పునరుద్ధరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను, విద్యుత్ స్తంభాలను పరిశీలించారు.

వర్షానికి అపార నష్టం

కలిగిరి: మండలంలోని మూడు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు అపార నష్టం ఏర్పడింది. పలు గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నిమ్మ, బత్తాయి, మామిడి తోటల్లో చెట్లు విరిగి పోవడంతో పాటు నెలకొరిగాయి. వరి, పత్తి, పచ్చిశనగ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు కుమ్మరకొండూరు, సిద్ధనకొండూరు ప్రాంతాల్లో 120 విద్యుత్ స్తంభాలు, 30 ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయి దెబ్బతిన్నాయి. ట్రాన్స్‌కో ఏఈ దినేష్, సిబ్బంది విద్యుత్ స్తంభాలు, లైన్లకు మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పలు గ్రామాల్లో పూరిళ్లు, రేకుల ఇళ్లు వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్నాయి.

వరికి తీవ్రనష్టం

చేజర్ల: అకాల వర్షం అన్నదాతలను ఇబ్బందులకు గురి చేస్తోంది. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట కోత దశలో ఉంది. మండలంలో శుక్ర, శనివారం కురిసిన వర్షాలకు చేతికంది వచ్చిన పంట నేలవాలి తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మండలంలో దాదాపు 8,600 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటి వరకు దాదాపు 15 శాతం కోతలు పూర్తయ్యాయి. వర్షానికి తోడు ఈదురు గాలులు తోడవడంతో మండలంలోని ఏటూరు, ఎన్వీకండ్రికలో వరి నేల వాలింది.

విద్యార్థుల్లో క్రీడలతో ఆత్మస్థైర్యం


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలిరూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడి అధిగమించాలంటే క్రీడా మైదానాలను సందర్శించి క్రీడలపై మక్కువతో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మద్దూరుపాడు వద్ద ఉన్న డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి క్రీడాకారులతో కలిసి బ్యాడ్మింటన్ ఆడి వారిని ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో మహిళల ప్రాధాన్యం ఇంకా పెరగాలని, ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో అన్నీ రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. గెలుపు ఓటములు ముఖ్యం కాదని క్రీడల్లో పాల్గొనాలన్నారు. మనస్సు పెట్టి ఆత్మస్థైర్యంతో ఆడితే గెలుపు నీ సొంతం అవుతుందని క్రీడాకారులకు తెలియజేశారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో విశాఖపట్నం జట్టు విజేతగా నిలువగా ప్రకాశం జట్టు రన్నర్స్‌గా నిలిచారు. మహిళల విభాగంలో విశాఖపట్నం జట్టు విజేతగా నిలవగా రన్నర్స్‌గా తూర్పు గోదావరి జట్టు నిలిచింది. అనంతరం విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, కళాశాల సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌కు 250 మంది హాజరు


టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

వింజమూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 10వ తరగతి విద్యార్థుల టాలెంట్ టెస్ట్‌కు 250 మంది హాజరయ్యారు. వింజమూరుకు చెందిన గుణసాత్విక్ 96 మార్కులతో ప్రథమ బహుమతి, గుండెమడకలకు చెందిన శరత్‌కుమార్ 95 మార్కులతో ద్వితీయ బహుమతి, వింజమూరుకు చెందిన కే తులసిరెడ్డి 93 మార్కులతో మూడో బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బాబురెడ్డి, శేషులు, అచ్చయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం


రికార్డులు పరిశీలిస్తున్న శ్రీదేవి

సోమశిల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని ఏబీసీడబ్ల్యూఓ ఎం.శ్రీదేవి తెలిపారు. అనంతసాగరం మండలంలోని రేవూరు బాలికల వసతిగృహాన్ని ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందజేస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. వసతిగృహ విద్యార్థుల కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోందని, పథకాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆమె వెంట సంక్షేమ అధికారిణి మల్లీశ్వరి, వసతిగృహ సిబ్బంది ఉన్నారు.

రేపటి నుంచి పాఠశాలల్లో రాగిజావ

జలదంకి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం నుంచి రాగిజావ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంఈఓ శ్రీధర్ ఆదివారం తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రాగిపిండి, బెల్లం పిండిలను చౌకడిపోల ద్వారా అన్ని పాఠశాలలకు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం కలుగకుండా పోషక విలువలున్న రాగిజావను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు.

మూడు పొగాకు బ్యారన్ల దగ్ధం

• రూ.8 లక్షల మేర నష్టం


బ్యారన్‌లో నుంచి ఎగిసి పడుతున్న మంటలు

కలిగిరి: మండలంలోని లక్ష్మీపురం కండ్రికలో ఆదివారం ప్రమాదవశాత్తు మూడు పొగాకు బ్యారన్లు దగ్ధమయ్యాయి. బాధితుల వివరాల మేరకు గ్రామంలో చుండూరి వెంకటరంగం, చుండూరు సుబ్బారావు, కట్టా చిరంజీవి కలిసి మూడు బ్యారన్లు నిర్మించారు. వాటిలో రెండు బ్యారన్లలో చుండూరు వెంకటరంగం, సుబ్బారావు ప్రస్తుతం పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు బ్యారన్లలోని గొట్టాలపై క్యూరింగ్ చేస్తున్న పొగాకు పడడంతో మంటలు వ్యాపించాయి. రెండు బ్యారన్లలో ఉన్న పొగాకు, కర్రలు, టైర్లు, ఇనుపగొట్టాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. పక్కనున్న చిరంజీవి బ్యారన్‌లోని సామగ్రి కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.8 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు: మండలంలో వినియోగదారులు నిత్యం వాడే వస్తువుల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ చల్లగాలి వెంకటమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుడు వస్తువును కొనుగోలు చేసేటప్పుడు ప్రధానంగా తయారీ, గడువు తేదీలను సక్రమంగా చూసుకోవాలన్నారు. గడువు, తయారీ తేదీలు లేకుండా దుకాణదారులు వస్తువులు విక్రయిస్తే చట్టరీత్యా నేరమవుతుందన్నారు. మండలంలో కొంత మంది వ్యాపారస్తులు ఈ విషయాన్ని విస్మరిస్తున్నారు.

నాయకులకు నోటీసుల జారీ


వీకేపాడులో టీడీపీ వర్గీయుడికి నోటీసు జారీ చేస్తున్న ఎస్సై

వరికుంటపాడు: జీఓ నంబరు 1ని రద్దు చేయాలని కోరుతూ పోరాట ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి అనుమతులు లేవని, ఎవరు వెళ్లకూడదని ఆదివారం ఉదయగిరి, వరికుంటపాడు ఎస్సైలు ఎస్.ప్రభాకర్, బాలమహేంద్ర నాయక్ టీడీపీ, సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ, నాయకులకు ముందస్తుగా నోటీసులు జారీ చేశారు. అనుమతిలేకుండా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ఎవరైనావెళ్లితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

పేదల పెన్నిధి మల్లు స్వరాజ్యం


మల్లు స్వరాజ్యం వర్ధంతి సభలో మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూరు: భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేద ప్రజల కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపించిన ధీర వనిత మల్లు స్వరాజ్యమని ఆమె పోరాట స్ఫూర్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా ఉద్యమం సాగించిన మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏకలవ్యనగర్‌లో నిర్వహించారు. పలువురు సీపీఎం నాయకులు మాట్లాడుతూ సారా వ్యతిరేక పోరాటంలో కీలకపాత్ర పోషించిన స్వరాజ్యం 1978 నుంచి 1983 వరకు తుంగతుర్తి ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో డేవిడ్‌రాజు, కోలా రమణయ్య, కాలేషా, పోలయ్య, జేవీవీ నాయకులు హరికృష్ణ, నందా శ్రీను, గంధళ్ల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే ప్రజా సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మిదేవి

మర్రిపాడు: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ గంగవరపు లక్ష్మిదేవి చెప్పారు. మర్రిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు చెప్పిన అంశాలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మండలంలో సమస్యల పరిష్కారంలో అధికారులు పట్టించుకోవడం లేదని ఏపిలగుంట ఎంపీటీసీ సభ్యులు హజరత్‌రెడ్డి ఆరోపించారు. ప్రధానంగా విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, ఆ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందిస్తూ మరోసారి ఇలా లేకుండా వెంటనే పరిష్కరిస్తామని సంబంధిత శాఖ అధికారులు హామీ ఇచ్చారు. రానున్న వేసవి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్ ఖాన్, డిప్యూటీ తహసీల్దారు ఆనంద్, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలబడుతాం

• తడిచిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు
• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


కావలి: తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి/బిట్రగుంట: కావలి నియోజకవర్గంలో అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం తరఫున అండగా నిలబడుతామని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి, బోగోలు, అల్లూరు మండలాల్లో వర్షం కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. అధికారులు, రైతులు, స్థానిక నాయకులతో కలిసి నేరుగా పంట పొలాల్లోనే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాలకు తడిచి రంగు మారిన ధాన్యాన్ని కూడా పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. వర్షాలకు తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా సోమవారమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ డీఎంకు ఫోన్‌లో సూచించారు. ధాన్యం నిల్వ చేసుకుంటామనే రైతులకు కావలి వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ గోదాముల్లో తగిన వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాల కారణంగా పంట నేలవాలి నష్టపోయిన రైతులకు కూడా ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు వీలైనంత త్వరగా పంట నష్టం అంచనాలు రూపొందించాలని సూచించారు. అధికారులు అంచనాలు సిద్ధం చేసిన వెంటనే జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సాయం అందించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, రైతులు ఉన్నారు.

బోగోలు మండలంలో...

బోగోలు మండలంలో వర్షాల కారణంగా దెబ్బతిన వరిపంటను ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పలు గ్రామాల్లో నేలవాలిన వరిని, నీళ్లు నిలిచిన పొలాలను పరిశీలించి రైతులకు అండగా నిలబడుతామని భరోసా కల్పించారు. వర్షాలకు తడిచి రంగు మారిన ధాన్యాన్ని కూడా పరిశీలించారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, స్థానిక నాయకులు, అధికారులు ఉన్నారు. ఆర్డీఓ వీకే శీనానాయక్, వ్యవసాయశాఖ కావలి ఏడీ కన్నయ్య కూడా వర్షాలకు దెబ్బతిన పంటలను పరిశీలించి వివరాలు సేకరించారు.

అల్లూరులో..

అల్లూరు: మూడు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు అల్లూరు మండలంలో దెబ్బతిన్న పంటలను, తడిసిన ధాన్యాన్ని క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆదివారం ఆయన గోడౌన్ల వద్ద తడిసిన వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులను పరామర్శించారు. ధాన్యాఆన్ని పరిశీలించారు. అనంతరం సింగపేటలోని పంట పొలాల్లో దిగి పడిపోయిన వరిపైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కూడా మాట్లాడడం జరిగిందని, నష్టపోయిన రైతును ఆదుకొనే విధంగా చర్యలు చేపట్టాలని అధికారుకు సూచనలు చేశామన్నారు. రైతులకు మునుపెన్నడూ లేని విధంగా తమ ధాన్యాన్ని రూ.18,500, షుగర్‌లెస్ ధాన్యాన్ని రూ.21వేల వరకు అమ్ముకోవడం ఇదే మొదటిసారన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ సుధాకర్ రాజు, ఏడీఏ కన్నయ్య, ఏఓ వేణుగోపాల్ రావు, తహసీల్దార్ శ్రీరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ ప్రసాద్ యాదవ్, వైస్ ఏఎంసీ చైర్మన్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, నాయకులు దండా కృష్ణారెడ్డి, మేడా కృష్ణా రెడ్డి, నీలం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


కావలి: నేలవాలిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి